క్లుప్తంగా

వెంకన్నకు పుష్పయాగం


పుష్పయాగంలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్ కాలనీలోని శివ బాలాజీ ఆలయంలో ఆలయ అర్చకులు గోపి నంబాళ్ల సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనాలు చేసుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తిరుప్పావై, నక్షత్రహారతిలు ఇచ్చారు. 21 రకాల జాతుల పుష్పాలతో ఉత్సవమూర్తులకు పుష్పయాగం జరిగింది.

స్థలం కేటాయింపునకు చర్యలు


స్థలం వివరాలు తెలియజేస్తున్న తహసీల్దార్ వెంకటరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావుల చొరవతో తూర్పుకాపు సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపునకు చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా శనివారం పాత్రునివలసలో స్థలాన్ని పరిశీలించారు. అలాగే శ్రీకాకుళం నగరానికి సమీపంలో పాత్రునివలస, అంపోలు, ఎచ్చెర్ల ప్రాంతాల్లో పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. సుమారు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. స్థల పరిశీలనలో శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు, మండల సర్వేయర్ రఘు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, కొండాల గణేష్ ఉన్నారు.

ఎస్‌ఐ పోస్టుకు ఇద్దరు ఎంపిక


కూర్మినాయుడు


రమణ

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎస్సై ఉద్యోగాలకు మండలంలోని నడిమివలస గ్రామానికి చెందిన బి.కూర్మినాయుడు, డిఆర్‌వలస గ్రామానికి చెందిన కె..రమణ ఎస్సై ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కూర్మినాయుడు ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రమణ ప్రస్తుతం కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఎంపిక పట్ల ఆయా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం


స్వామివారికి హారతిస్తున్న ప్రధాన అర్చకుడు శంకరశర్మ

అరసవల్లి:వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆదిత్యుని కల్యాణ సేవను శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. అనివేటి మండపంలో ప్రత్యేక వెండి సింహ వాహనంలో స్వామి వారి ఉత్సవమూర్తులను వేంచేసింపజేసి కల్యాణసేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ ఆగమశాస్త్ర ప్రకారం ఆదిత్యుని కల్యాణం జరిగింది. అనంతరం సాయంత్రం వరకు ఉత్తర ద్వార దర్శనాలు చేయించిన తర్వాత తిరువీధిగా ఉత్సవమూర్తులను ఆలయంలోనికి తీసుకొచ్చారు. అలాగే ఆదివారం కూడా గర్భాలయంలో స్వామి వారిని స్వర్ణాలంకరణలో దర్శనం చేసుకునే అవకాశముందని, ఆలయంలోనికి కెమెరాలను, సెల్‌ఫోన్లను అనుమతించేది లేదని ఈవో హరిసూర్యప్రకాష్ స్పష్టం చేశారు.

ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేయాలి


దీక్షలో న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిల్ చట్టం–22ను తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు కోరారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా కోర్టు ఎదుట రిలే నిరాహార దీక్షలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఈ చట్టం గుదిబండగా మారిందన్నారు. దీక్షలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఇద్ది పాపయ్య, టి.మధుసూదన్ రావు, వి కష్టారావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, కూన అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పీఎన్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తజనం


శ్రీకాకుళం కల్చరల్: కోదండరామాలయంలో ఉత్తర ద్వార దర్శనాలు

నేత్రపర్వం.. ఉత్తరద్వార దర్శనం


అరసవల్లిలో ఉత్తర ద్వారా దర్శనానికి బారులు తీరిన భక్తులు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు శనివారం భక్తులతో కళకళలాడాయి. ధనుర్మాస తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి పూజలు చేసేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వచ్ఛందసంస్థలు ఉచితంగా ప్రసాదాలు, మంచినీటిని సరఫరా చేశారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం, పీఎన్ కాలనీలోని నారాయణతిరుమల కొండ, శ్రీకూర్మంలోని కూర్మనాథుని ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. భజన బృందాలు భక్తిగీతాలను ఆలపించారు.


శ్రీకాకుళం కల్చరల్:భజనలు చేస్తున్న భక్తులు


ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేటలోని లలితా చంద్రమౌళీశ్వర ఆలయానికి ముర్రాటలతో వెళ్తున్న భక్తులు


ఎచ్చెర్ల: లావేరు మండలం చిన్నవెంకటాపురం రామాలయంలో పూజలను నిర్వహిస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం రామాలయంలో ప్రత్యేక పూజలు


ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల వెంకటేశ్వర ఆలయంలో అన్నసమారాధన


శ్రీకాకుళం కల్చరల్:మొండేటివీధి వెంకన్న ఆలయంలో ఉచిత ప్రసాదం పంపిణీ


శ్రీకాకుళం కల్చరల్: అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మి


మొండేటివీధిలో పూజలందుకున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

వివాదాస్పద స్థలంలో కంచె ఏర్పాటు


కంచె ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రణస్థలం: మండల కేంద్రంలోని సీఐ కార్యాలయం వెనక ఉన్న సర్వే నంబర్ 2–1లో 13 సెంట్ల వివాదాస్పద స్థలం ఉందని, ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్ హెచ్చరించారు. ఈ స్థలానికి సంబంధించి జే.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్, పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ, పంచాయతీశాఖల అధికారులు సిమెంట్ స్తంభాలతో శనివారం కంచెను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ స్థల వివాదం హైకోర్టులో పెండింగ్ ఉందన్నారు. తీర్పు వెలువడేంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టవద్దని గతంలోనే బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఈ స్థలం పూర్తి స్థాయిలో గ్రామకంఠంగా ఉన్నందున పంచాయతీ అధికారులకు అప్పగిస్తున్నామన్నారు. విలువైన స్థలం కావడంతో కంచె ఏర్పాటు చేశామని తెలియజేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు వై.జగన్నాథం, వెంకన్న, పంచాయతీ కార్యదర్శి లింగాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ యువజన విభాగం శ్రీకాకుళం నియోజకవర్గ మండల, మున్సిపాలిటీ, క్లస్టర్ అధ్యక్షులను ఎంపిక చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం రూరల్ మండలానికి గుండ హరీష్, గార మండలం అరంటి సూర్య, శ్రీకాకుళం కార్పొరేషన్ క్లస్టర్–1 టంకాల బాలకృష్ణ, క్లస్టర్–2 కర్నేన హరిలను నియమించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల యువజన విభాగం అధ్యక్షులను నియమించారు.

నేడు శ్రీకాకుళంలో 3కే రన్


ఆడుదాం ఆంధ్రా టీషర్టులను యువతతో కలిసి ఆవిష్కరిస్తున్న మెంటాడ స్వరూప్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించనున్న 3–కే రన్ ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 26 నుంచి మొదలుకానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అధికార యంత్రాంగం, క్రీడావర్గాలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నమగ్నమై ఉన్నారు. వాయువేగంగాతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ర్యాలీ జరగనుంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, ఒలింపిక్ అసోసియేషన్, క్రీడాసంఘాలు, యువత, క్రీడాకారులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రాకు సంఘీభావంగా ర్యాలీ జరగనుంది. ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల నుంచి అంబేడ్కర్ జంక్షన్, డే అండ్ నైట్ జంక్షన్, పాలకొండ రోడ్, కృష్ణాపార్క్ మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ జరగనుంది. ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఉదయం ఆరున్నర గంటలకు మొదలయ్యే ర్యాలీకి ముఖ్యఅతిథులుగా రాష్ట మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, అధికారులు హాజరవుతున్నారని మెంటాడ స్వరూప్ శనివారం తెలిపారు. కాగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల టీషర్టులను మండలవీధిలో ఉన్న తన నివాసంలో మెంటాడ స్వరూప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బరాటం సంతోష్, సింహాద్రి శ్రీను, మట్ట నగేష్, రాజ్, పొట్నూరు గోవింద్, ఇప్పిలి సతీష్, భోగి నాగరాజు, అందవరపు సతీష్, వరదాన శివకుమార్, కనపల తేజేశ్వరరావు, ఇలియాస్ హుస్సేన్ పాల్గొన్నారు.

టూరిజంతో విజ్ఞానం, వినోదం


జిల్లా పర్యాటక శాఖ అధికారితో సై్కె వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: టూరిజంతో విజ్ఞానం, వినోదం కలుగుతాయని జిల్లా పర్యాటక శాఖ అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. సంతసీతారంపురం సై్కె వ్యవసాయ కళాశాలను శనివారం సందర్శించారు. అనంతరం అగ్రి టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పురాతన నిర్మాణాలు, చారిత్రక ప్రాంతాలు, ఆలయాలు ఇలా ప్రతీ అంశానికి పర్యాటకంలో ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు.


విజ్ఞాన సందర్శనకు అనువుగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలను సైతం పర్యాటకంలో భాగం చేస్తున్నట్లు చెప్పారు. 135 ఎకరాల్లో ఉన్న సై్కె వ్యవసాయ కళాశాలను అగ్రి టూరిజంగా గుర్తించి, క్లబ్ ప్రారంభించినట్లు చెప్పారు. పర్యాటకులను ఆకర్షించేలా ఇక్కడ వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వి.శ్రావని, వ్యవసాయ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బస్సులో బంగారం దొరికింది..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఓ ప్రయాణికురాలు బస్సు దిగుతుండగా అందులో బంగారు వస్తువు దొరికింది. దాన్ని ఆమె పోలీసులకు అప్పగించారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం కొత్తూరు శైరిగాం గ్రామానికి చెందిన ఆరంగి పుష్పలత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల సమయంలో బందరువానిపేట నుంచి శ్రీకాకుళం వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. శ్రీకాకుళం పాతబస్టాండులో బస్సు దిగేటప్పుడు తులంన్నర (అంచనా) బంగారు వస్తువు కనిపించడంతో నేరుగా ఒకటో పట్టణ పోలీసులకు తెచ్చి ఇచ్చారు. వస్తువు పోగొట్టుకున్నవారు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ గణేష్ కోరారు.

సాంకేతికతపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యుగంధర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమని టెక్కలి ఐతం కళాశాల ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.యుగంధర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'కృత్రిమ మేధ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం కృత్రిమ మేధ పారిశ్రామిక రంగంలో కీలకంగా మారిందన్నారు. పరిశ్రమలు నిర్వహణ ఖర్చు తగ్గేలా కృత్రిమ మేధ ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులు తాము చదువుతున్న కోర్సులో ప్రతి అంశం తెలుసుకోవాలన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు గమనించాలన్నారు. సాంకేతిక అంశాలపై పట్టు సాధించే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

కూర్మనాథునికి ప్రత్యేక పూజలు


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మం శ్రీకూర్మనాథుని (విష్ణుమూర్తి రెండవ అవతారం) ఉత్తర ద్వార దర్శనం శనివారం కనులపండువగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వాములను గరుడ వాహనంపై ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు పూజలు చేసి స్వామికి ప్రత్యేక హారతినిచ్చారు. అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను మంటపంలో అలంకరించిన ఆసనంపై ఉంచి పూజలు చేశారు. తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు దాసుబాబు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా పూజలు జరిగాయి ఆలయ ఈవో జి.గురునాథరావు, పాలకమండలి సభ్యులు పూడి కమల, అనుపోజు నాగరాజు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ప్రియం..

మహిమ మందిరం


గార: క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

• గార చర్చిలో రోజూ సేవలు

గార: మండల కేంద్రం గార సంతతోట సమీపంలో 24 ఏళ్ల క్రితం ఏర్పడిన ఏసుక్రీస్తు మహిమ మందిరం క్రైస్తవులకు ప్రియంగా ఉంది. బిషప్ వి.జాషువా దంపతులు నెలకొల్పిన ఈ మందిరం అంచెలంచెలుగా ఎదిగి మండలంలోనే ప్రథమంగా నిలిచి మిగిలిన చర్చిలకు మార్గదర్శిగా నిలిచింది. మండలంలో ఇప్పటి వరకు 16 చర్చిలు ఏర్పాటైనప్పటికీ.. మండల కేంద్రంలోని చర్చే ప్రధాన కార్యాలయంగా నడుస్తోంది. ఇక్కడి మందిరం ఏర్పాటైనప్పటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో భాగంగా అన్నదానం, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ ఏడాది పొడుగునా నిర్వహిస్తున్నారు. మండలంలోని పాస్టర్లు అందరినీ సమన్వయం చేస్తూ ఏసు క్రీస్తు పండుగలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ప్రతి ఆదివారం అధికసంఖ్యలో క్రైస్తవులు వచ్చి ప్రార్థనలు చేస్తుంటారు. హుద్‌హుద్ తుఫాన్ ప్రభావంతో బాధితులుగా మారిన నిరుపేదలకు వెయ్యి చీరెలు, ఇంటి వస్తు సామగ్రిని అందించి మహిమ మందిరం ప్రతినిధులు గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే కరోనా సమయంలో 400 మందికి ఆహార సామగ్రిని అందజేశారు.


గార: విద్యుత్ కాంతులతో ఏసుక్రీస్తు మహిమ మందిరం


శ్రీకాకుళం కల్చరల్: ప్రసంగిస్తున్న శ్రీనివాస పట్నాయక్


శ్రీకాకుళం కల్చరల్: క్రీస్తు సందేశం ఇస్తున్న ఉషారాణి


ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరెడ్డి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

పాఠశాలలో సందడిగా క్రిస్మస్ వేడుకలు

గార: కె.మత్స్యలేశంలోని బుద్ధా పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. శాంతాక్లాజ్, బొమ్మలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ బి.లలిత క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.ఎర్రన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివారంపేటలో క్రిస్మస్ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: ఆదివారంపేటలోని పెనుఏలు ప్రార్థనా మందిరంలో క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ క్రైస్తవ మిషనరీలు చేస్తున్న సేవలను కొనియాడారు. పాస్టర్ సత్యాల రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాస్టర్ దానియేలు రాజు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కేక్ కటింగ్ చేశారు. యువతులు క్రిస్మస్ గీతాలు ఆలపించి, కేండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ నర్సింగ్ సిస్టర్ అవ్వమ్మ, ఎస్.అల్ఫాండ్స్, పాస్టర్ దేవరాజు పాల్గొన్నారు.

మహాలక్ష్మీనగర్‌లో..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో ఉన్న ఎలోహి క్రైస్తవ ప్రార్థన మందిరంలో పాస్టర్ ఎస్.సురేష్ ఐజాక్ ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎలిజిబెత్ రాణి దైవసందేశం ఇచ్చారు. ముఖ్య అతిథులుగా జాకబ్‌రాజు, శ్రీను, రత్నబాబు, ఉషారాణి ఉన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని కేశవరెడ్డి పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంధ్యారాణి మాట్లాడుతూ.. క్రిస్మస్ ప్రాధాన్యత, ఏసు క్రీస్తు బోధనలు, బైబిల్ సారాంశం వివరించారు. విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి

రణస్థలం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించాలని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 3,228 మంది క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఏఓ ధనుంజయరావు పాల్గొన్నారు.